నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, గురువారం 27 జూన్ 2024 | KARIMNAGAR

## బాబోయ్.. పెద్ద చేప



మత్స్యకారుడు పురుషోత్తంకు చిక్కిన 29 కేజీల బొచ్చె

కరీంనగర్ రూరల్: జూన్ 26: కరీంనగర్ లోయర్ మానేరు రిజర్వాయర్ (ఎల్ఎండీ) లో బుధవారం 29 కేజీల చేప చిక్కింది. తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లిన కూర పురుషోత్తం వేసిన కచ్చు వలలో పడ్డది. పెద్ద చేపను చూసి మత్స్యకారుడు సంబురపడ్డాడు. దీనిని మార్కెట్‌లో ₹4600కు విక్రయించానని సంతోషంగా చెప్పాడు. ఇటీవల కాలంలో ఇంత పెద్ద చేప దొరకలేదని పేర్కొన్నాడు.


## 29న కరీంనగర్‌లో జాబ్ మేళా

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 26 : కరీంనగర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కరీంనగర్ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి వై తిరుపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా నివాబుపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో అడ్వైజర్స్ 100, ఏజెన్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ 15, ఏజెన్సీ మేనేజర్ మూడు పోస్టులు భర్తీ చేస్తారని చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగులు ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వారికి ₹15 వేల నుంచి ₹30 వేల వరకు వేతనం ఇస్తారని వెల్లడించారు.

# ఇదేమి శిక్ష?


- రాజకీయ కక్షకు ఇద్దరు ఎంఈవోలు బలి!
- కాంగ్రెస్ హుజూరాబాద్ ఇన్‌చార్జి ప్రణవ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆగమేఘాలపై డీఈవో చర్యలు
- ఎమ్మెల్యే సమీక్షా సమావేశానికి ఎలా హాజరయ్యారంటూ నోటీసులు
- సంజాయిషీని పరిగణలోకి తీసుకోకుండా రిటేన్ చేస్తూ ఆదేశాలు!
- కరీంనగర్ విద్యాశాఖ తీరుపై విమర్శలు

**రాజకీయ కక్షకు ఓ ఇద్దరు మండల విద్యాధికారులు బలవ్వాల్సి వచ్చింది. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఇచ్చిన ఫిర్యాదుతో విద్యాశాఖ చర్యలు తీసుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఆ ఇద్దరు ఎంఈవోలకు ఆగమేఘాల మీద నోటీసులు ఇవ్వడమే కాకుండా.. సంజాయిషీని కూడా ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఏకంగా రిటేన్ చేస్తూ ఆదేశాలు జారీ చేయడం కలకలం రేపుతున్నది. ఎమ్మెల్యే సమీక్షా సమావేశాలకు హాజరైనందుకు చర్యలు తీసుకోవడం, ఈ విషయంలో కరీంనగర్ జిల్లా విద్యాధికారి వ్యవహరించిన తీరు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది.**



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER KARIMNAGAR

ప్రణవ్ బాబు ఫిర్యాదుతో విద్యాశాఖ ఇచ్చిన నోటీస్



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER, KARIMNAGAR

ఎంఈవోలను రిటర్న్ చేస్తూ జిల్లా విద్యాధికారి ఇచ్చిన ఉత్తర్వు కాపీ

కరీంనగర్, జూన్ 26 (నమస్తే తెలంగాణ ప్రతిధి) : హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న అసౌకర్యాలు, కావాల్సిన అవసరాలు, విద్యార్థుల భవిష్యత్ వంటి అంశాలపై చర్చించేందుకు ఈ నెల 15న హుజూరాబాద్‌లోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి సైదాపూర్, శంకరపట్నం, హుజూరాబాద్ మండలాల ఎంఈవోగా కొనసాగుతున్న కే నరసింహారెడ్డి, అలాగే వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాలకు మండల విద్యాధికారిగా కొనసాగుతున్న వీ శ్రీనివాస్ హాజరయ్యారు. వీరితోపాటు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి తేవాలని, ప్రధానంగా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కోరారు. దీంతో హెచ్‌ఎంలు పాఠశాలల వారీగా పలు సమస్యలను దృష్టికి తేగా.. వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నిజానికి నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు సమీక్షలు పెట్టడం, సమస్యలు పరిష్కరించుకోవడం అనాదిగా వస్తున్నదే. అదే పద్ధతిని కౌశిక్‌రెడ్డి కొనసాగించారు.

### కక్ష సాధింపు చర్యలు!

సమీక్షకు మండల విద్యాధికారులు హాజరవ్వడమే కాకుండా.. హెచ్‌ఎంలను తీసుకెళ్లారని, ఎమ్మెల్యే సమీక్షా సమావేశానికి ఎలా వెళ్తారంటూ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ కరీంనగర్ జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ప్రణవ్ బాబు ఫిర్యాదు చేసినట్టు స్వయంగా డీఈవో జారీ చేసిన నోటీసులోనే స్పష్టం చేశారు. అంతేకాదు, ఆ ఫిర్యాదుపై వివరణ ఇవ్వడంతోపాటు ప్రధానోపాధ్యాయులను ఎందుకు తీసుకెళ్లారో చెప్పాలంటూ సదరు నోటీసులో పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండానే సమీక్షకు హాజరైన మీపై చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలంటూ ఇద్దరు మండల విద్యాధికారులకు నోటీసులు ఇచ్చారు. అందుకు సంబంధించిన నోటీస్ ఈ నెల 21న జారీ చేశారు. ఆ మేరకు కారణాలను వివరిస్తూ ఎంఈవోలు వివరణ ఇచ్చారు. కానీ, అవేవి పట్టించుకోకుండా సదరు మండల విద్యాధికారులను ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ.. వారి వారి పాఠశాలలకు రిటేన్ చేశారు. వీరి స్థానంలో కొత్తవారికి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ ఇచ్చారు.

### డీఈవో తీరుపై విమర్శలు

సాధారణంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేలు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారు. విద్యకు సంబంధించి మాత్రమేకాదు, అన్ని శాఖల అధికారులతో సమీక్షలు పెడుతారు. ఎమ్మెల్యేల పిలుపు మేరకు.. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు వెళ్లడం సర్వ సాధారణం. ఇది అనాదిగా వస్తున్నదే. ఇదే కోవలో హుజూరాబాద్ మండల విద్యాధికారులు వెళ్లారు. కానీ, ఈ విషయంలో ఏదో తప్పు జరిగినట్టుగా విద్యాశాఖ అధికారి వ్యవహరించిన తీరు ప్రస్తుతం విమర్శలకు తావిమస్తున్నది. కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా విద్యశాఖ అంత ఆగమేఘాల మీద ఎందుకు స్పందించిందో అర్థంకాని విషయమే. ఒకవేళ స్పందించినా వాస్తవాలు తెలుసుకోవాలి. సమీక్షలో ఏం జరిగిందో గుర్తించాలి. లేదా ఒక విచారణ అధికారిని వేసి వివరాలు తీసుకోవాలి. కానీ, ఇవేవి లేకుండానే సదరు అధికారులను రిటేన్ ఎలా చేస్తారన్న ప్రశ్నలు విద్యాశాఖలో ఉత్పన్నమవుతున్నాయి.

- మున్సిపల్ కార్మికులపై అడుగడుగునా వివక్షే





కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

- మూడు నెలలైనా జీపీ కార్మికులకు వేతనాలేవి?





కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

# కార్మికుల కన్నెర్ర

- సమస్యల పరిష్కారం కోసం కదం
- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట జీపీ, మున్సిపల్ శ్రామికుల ధర్నా

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 26: సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు కదం తొక్కారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని, తమను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. బుధవారం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట వేర్వేరుగా ధర్నా చేశారు. కాంగ్రెస్ పాలనలో కార్మికుల సంక్షేమం అటకెక్కిందని, తమ బతుకులు ఆగమవుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. గంటకు పైగా ఆందోళన చేపట్టిన అనంతరం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేసి, సమస్యలు పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు ధర్నా చేయగా, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు నెలలుగా జీపీ కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, కుటుంబాలు పస్తులుండే పరిస్థితులు దాపురించాయని వాపోయారు. కార్మికులకు అందజేయాల్సిన సబ్బులు, డ్రెస్సులు, కొబ్బరినూనె, శానిటరీ వస్తువుల పంపిణీ కూడా నిలిపివేశారని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి పాల్గొని మాట్లాడారు. నూతన పీఆర్సీలో కార్మికుల వేతనాన్ని కనీసం ₹26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యమే శ్రేయస్సుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు అడుగడుగునా వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ఆర్టీనెం.60, 63లో నిర్ణయించిన మేరకు కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలని సూచించారు. ధర్నా కార్యక్రమాల్లో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా శాఖ ప్రతినిధులు రాచర్ల మల్లేశం, రవీందర్‌రావు, కాశిపాక శంకర్, వడ్లూరి లక్ష్మీనారాయణ, బొజ్జ మధురమ్మ, స్వరూప, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అశోద రవీందర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యూ శ్రీనివాస్, పోచయ్య, దదాసరి రాజమల్లయ్య, కే రవి, ఎండీ అజ్జు, అంజయ్య, శంకరయ్య, బుజ్జమ్మ, సరోజ ఉన్నారు.

## చిన్నారి నీ హైటెంత..?

- అల్లీపూర్ అంగన్‌వాడీలో పిల్లల ఎత్తు, బరువు చెక్ చేసిన కలెక్టర్ సత్యప్రసాద్



అల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వసతులు, పిల్లలకు అందిస్తున్న సేవలను అడిగితెలుసుకున్నారు. స్టేడియోమీటర్ ద్వారా స్వయంగా పలువురు పిల్లల ఎత్తును కొలతవేసి రికార్డుల్లో నమోదు చేయించారు. ఎత్తుకు తగిన బరువు లేనివారికి బాలమృతం ప్యాకెట్లు ఇవ్వాలని సూచించారు.

**- రాయికల్, జూన్ 26**

## బోట్స్ క్లబ్ అధ్యక్షుడిగా చెన్నాడి సుధాకర్‌రావు



బోయినపల్లి, జూన్ 26: హైదరాబాద్ బోట్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా చెన్నాడి సుధాకర్‌రావు బుధవారం ఏకగ్రీవమయ్యారు. ఇప్పటికే పదిసార్లు అధ్యక్షుడిగా గెలిచిన ఆయన, ఇప్పుడు పదోకొండోసారి కూడా ఎన్నికయ్యారు. హుస్సేన్‌సాగర్ వద్ద బోట్స్ క్లబ్ ప్రెసిడెంట్ పదవీకి ఈ నెల 22న నోటిఫికేషన్ వెలువడడంతో బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ, మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెన్నాడి సుధాకర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో ఆయనతోపాటు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు సుధాకర్‌రావు మూడుసార్లు ఎన్నికల బరిలో నిలిచి గెలువగా.. ఎనిమిదిసార్లు ఏకగ్రీవంగా విజయం సాధించారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇసుక దందాపై సీరియస్

- రంగంలోకి సిరిసిల్ల కలెక్టర్.. కట్టడికి ఆదేశాలు
- అక్రమంగా తరలించకుండా వాగు మార్గాల్లో కందకాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు
- ఇటు పోలీస్‌శాఖ ముమ్మరంగా తనిఖీలు
- ఒకే రోజు ఎనిమిది వాహనాల సీజ్.. 12 మంది రిమాండ్

ముస్తాబాద్/ సిరిసిల్ల తెలంగాణ చౌక్, జూన్ 26: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. నిబంధనలకు విరుద్ధంగా సిరిసిల్లలోని మానేరు వాగు, వేములవాడలోని మూలవాగుల్లో తవ్వుతున్నది. నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నది. ఓవైపు ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రజలు అవస్థలు పడుతుంటే.. మరోవైపు కట్టడి చేసేందుకు వచ్చిన అధికారులపై దాడులకు తెగబడుతున్నది. శనివారం వేములవాడలో ప్రజలందరూ చూస్తుండగానే ఓ మైనింగ్ అధికారిపై డ్రైవర్ దాడికి యత్నించగా, రెండు రోజుల క్రితం నామాపూర్ శివారులో ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న ఓ కానిస్టేబుల్‌ను హతమార్చేందుకు యత్నించింది. ట్రాక్టర్ ఇంజిన్ బానెట్‌పై కూర్చున్న కానిస్టేబుల్‌ను వాహనంతోసహా చెరువులో పడేసేందుకు డ్రైవర్ యత్నించగా.. పసిగట్టిన కానిస్టేబుల్ దూకడంతో గాయాలు కాగా.. ట్రాక్టర్ చెరువులో పడిపోయింది. ఈ ఘటన భయోత్పాతం కలిగించగా.. ఇసుక మాఫియా బరితెగింపుపై జిల్లా అధికారులు సీరియస్ అయ్యారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రంగంలోకి దిగి, ఎగువ మానేరు వాగు పరిసర గ్రామాల నుంచి ఇసుక అక్రమ మార్గాలకు చెక్ పెట్టాలని, కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ముస్తాబాద్ తహసీల్దార్ సురేశ్ కుమార్‌ను బుధవారం ఆదేశించారు. దీంతో తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ అధికారులు, పోలీసులు రామలక్ష్మణపల్లె, కొండాపూర్ గ్రామాల శివారులోని మానేరు వాగు ఒడ్డు పరిసర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాగు నుంచి ఇసుక తరలించకుండా రహదారులకు అడ్డుకట్ట వేశారు. మార్గాల్లో జేసీబీలతో కందకాలు తీయించి ట్రాక్టర్లు వెళ్లకుండా చేశారు. ఇటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. ముస్తాబాద్, ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తనిఖీ నిర్వహించగా ఎనిమిది వాహనాలను సీజ్‌చేసి, 12మందిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 163 మందిపై కేసులు నమోదు చేసి, 161 వాహనాలను సీజ్ చేశారు. కాగా తరుచూ అక్రమ రవాణాకు పాల్పతున్న 14కేసుల్లో 21మందిని రిమాండ్‌కు తరలించారు.



ముస్తాబాద్ : ఎగువమానేరులో ఇసుకను అక్రమంగా తరలించకుండా జేసీబీతో కందకాలు తీయిస్తున్న రెవెన్యూ అధికారులు



ట్రాక్టర్ పత్రాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారి

### ఎవరినీ ఉపేక్షించేది లేదు

ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే వారిని ఉపేక్షించేది లేదు. జిల్లా వ్యాప్తంగా కట్టడికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాం. ఇసుక దందాతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధమున్న వ్యక్తులపై చర్యలు తప్పవు. రెండు సార్లకన్నా ఎక్కువ సార్లు పట్టుపడితే వాహనాలు జప్తు చేస్తాం. కఠినమైన చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ పనుల కోసం సబ్సిడీ తీసుకున్న ట్రాక్టర్లు ఇసుక రవాణా చేయద్దు. పట్టుపడితే ట్రాక్టర్లను సీజ్ చేసి, సబ్సిడీ రద్దుకు సిఫారసు చేస్తాం. అక్రమ రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారమున్న వెంటనే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురండి. దాడులను సహించం. శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం.

**-అఖిల్ మహాజన్, సిరిసిల్ల ఎస్పీ**

# కాసేపైతే క్షేమంగా ఇంటికి.. అంతలోనే మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం
- బతికపల్లి వద్ద బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం
- సుద్దపల్లిలో విషాదం



గంగాధర్ (ఫైల్)

పెగడపల్లి, జూన్ 26: పని ముగించుకొని కాసేపట్లో ఇంటికి చేరాల్సిన ఆ యువకుడు అనుకోని ప్రమాదంలో మృత్యు ఒడికి చేరాడు. పెగడపల్లి మండలం బతికపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం, బైక్ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరోవ్యక్తి తీవ్ర గాయాలతో దవాఖానలో చేరాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలం సుద్దపల్లికి చెందిన బలుసు గంగాధర్(28), ముంజ రాజు ఇద్దరు కలిసి బుధవారం ఉదయం బైక్‌పై పనికోసం పెగడపల్లికి వచ్చారు. పని పూర్తి చేసుకొని సాయంత్రం తిరుగుపయనమయ్యారు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికే చేరేవారు. కానీ, మరో రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉండగా.. బతికపల్లి శివారు.. సుద్దపల్లి సమీపంలో వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో గంగాధర్ తలకు బలమైన దెబ్బలు తగలడంతో అక్కడికక్కడే చనిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ రాజును '108'లో జగిత్యాల దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ దవాఖానకు తరలించారు. రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పెగడపల్లి ఎస్ఐ జాడి రామకృష్ణ పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. సీసీ పుటేజీలను పరిశీలించి వాహనాన్ని గుర్తిస్తామని చెప్పారు.



మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాధిత రైతులు

# మక్క రైతు దగా

- యాసంగి మక్కలను సేకరించిన వ్యాపారి
- 18 మందికి డబ్బులు చెల్లించకుండా జాప్యం
- నాలుగు నెలలైనా అందని ₹16 లక్షలు
- మెట్‌పల్లి ఠాణా మెట్లెక్కిన బాధిత రైతులు
- న్యాయం చేయాలని వేడుకోలు

మెట్‌పల్లి, జూన్ 26 : మక్క రైతులు దగా పడ్డారు. ఆరుగాలం శ్రమించి పండించి మక్కలను విక్రయిస్తే.. సదరు వ్యాపారి డబ్బులు చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలలైనా చేతికి పైసలు అందకపోవడంతో చివరకు ఠాణా మెట్లెక్కారు. ఇబ్రహీంపట్నం మండలం గోదూ ర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు యాసంగిలో సాగు చేసిన మక్కలను మెట్‌పల్లికి చెందిన మహిళా కమీషన్ ఏజెంట్‌కు విక్రయించారు. ఆమె రైతుల నుంచి కొన్న మక్కలను కామారెడ్డికి చెందిన వ్యాపారి విశ్వనాథ పరమేశ్వర్‌కు అమ్మింది. దాంతో ఆ వ్యాపారి మొదట కొందరు రైతులకు డబ్బులు చెల్లించగా, మిగతా 18 మందికి ఇంకా ₹16 లక్షలు చెల్లించాల్సి ఉన్నది. మక్కలు అమ్మి నాలుగు నెలలు గడిచినా డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈక్రమంలో మెట్‌పల్లిలోని కమిషన్ ఏజెంట్‌పై ఒత్తిడి పెంచా రు. దీంతో రెండు నెలల క్రితం ఆ ఏజెంట్ మక్కలు తీసుకున్న వ్యాపారి నుంచి ప్రామిసరీ నోట్లు, చెక్కులు రాయించి రైతులకు ఇప్పించింది. నెలక్రితం బ్యాంకులో వేసిన చెక్కులు బౌన్స్ కావడంతో రైతులు ఆగ్రహించారు. మళ్లీ డబ్బుల కోసం తిరిగారు. కమీషన్ ఏజెంట్‌పై మళ్లీ ఒత్తిడి పెంచారు. వ్యాపారి స్పందించకపోవడంతో చివరకు ఏజెంట్‌తో కలిసి బుధవారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కామారెడ్డికి చెందిన వ్యాపారిపై ఫిర్యాదు చేశారు. నెలలు గడిచినా డబ్బులు రావడం లేదని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# డ్రగ్స్‌ను తరిమేద్దాం.. ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం



తిమ్మాపూర్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కాలేజీలో డ్రగ్స్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, చిత్రంలో జిల్లా అధికారులు, తదితరులు



జగిత్యాల కొత్త బస్టాండ్ వద్ద ప్రజతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

'డ్రగ్స్‌ను తరిమేద్దాం.. ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం' అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువతీ యవకులు, విద్యార్థులు నినదించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అంతటా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు తీశారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. విద్యాసంస్థల్లో సమావేశాలు నిర్వహించి, కలెక్టర్లు, జిల్లా అధికారులు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా కావొద్దని, ఉజ్వల భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని పిలుపునిచ్చారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామంటూ ప్రతిజ్ఞలు చేయించారు.

**- తిమ్మాపూర్/ జగిత్యాల కలెక్టరేట్**

## ఆర్అండ్‌బీ ఏఈ జావిద్ సస్పెన్షన్

- విధుల్లో నిర్లక్ష్యం ఫలితం

జ్యోతినగర్/ పెద్దపల్లి, జూన్ 26: విధినిర్వహణలో నిర్లక్ష్యం చేసిన ఆర్అండ్‌బీ అసిస్టెంట్ ఇంజినీర్ ఎండీ జావిద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆయనను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అమ్మ ఆదర్శ స్కూల్ కమిటీ అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయకపోవడంతో విధుల నుంచి తొలగించారు. బుధవారం కలెక్టర్ ఎన్టీపీసీలోని దుర్గయ్యపల్లి, రామగుండం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండడాన్ని గమనించారు. అందుకు బాధ్యుడైన ఆర్అండ్‌బీ అసిస్టెంట్ ఇంజినీర్ జావిద్‌ను సస్పెండ్ చేశారు. విచారణ పూర్తయ్యే దాకా హెడ్ క్వార్టర్ వదిలివెళ్లడానికి వీలులేదని ఆదేశించారు.